



netisudiksha.online


# నేటి సుదీక్ష

సమాజానికి సరైన దృక్పథం

SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న నేటి సుదీక్ష దినపత్రికలో,బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిల్లో ఉత్సహావంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 7288033333



హనుమకొండ సంపుటి 01 సంచిక 60 ఆదివారం ,జూలై 19, 2026 , పేజీలు - 4 వెల : 2.00 PRGI NO : TGTEL/26/A3170


### “అసత్యం, హింసలే మోదీ ప్రభుత్వానికి

# మూల సిద్ధాంతాలు




**న్యూ ఢిల్లీ** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ- శనివారం కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 20 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న విద్యా సంస్కరణల ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను జంతర్ మంతర్ నిరసన స్థలం నుంచి దిల్లీ పోలీసులు సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ మేరకు ఎక్స్‌లో (ట్విట్టర్) స్పందించిన రాహుల్ గాంధీ 'అసత్యం, హింసే మోదీ ప్రభుత్వ మూల సిద్ధాంతాలు. అహింసా మార్గంలో నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను జంతర్ మంతర్ నుంచి తరలించడం తప్పు.' అని పోస్ట్ చేశారు. దేశ భవిష్యత్తుకు పేపర్ లీకులు, పెరుగుతున్న విద్యా ఖర్చులు, విద్యార్థుల ఆత్మహత్యలు అత్యంత కీలకమైన సమస్యలని రాహుల్ పేర్కొన్నారు. ప్రభుత్వం పోలీస్ బలగాల్ని ఎంతలా ఉపయోగించినప్పటికీ ఈ అంశాలపై స్వరం వినిపిస్తున్న విద్యార్థులను, వారికి మద్దతుగా నిలిచే తమ లాంటి వారిని అడ్డుకోలేరని అన్నారు.జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాం గ్‌చుక్‌ను శనివారం తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తుండటంతో వైద్యుల సలహా మేరకు పోలీసులు ఈ చర్య తీసుకున్నారు.

### అధికారంలోకి వచ్చిన తొలిఏడాదే దాదాపు

# 70 వేల ఉద్యోగాలు ఇచ్చాం

- ◆ఘట్‌కేసర్‌లో అందెశ్రీ స్మృతి వనానికి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- ◆ 16 ఏళ్ల తర్వాత తాము అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించామన్న సీఎం
- ◆ అందెశ్రీ సమాధి వద్ద నివాళులు



**హైదరాబాద్ :**మేకతోలు కప్పుకున్న తోడేలు ఇవాళ బయటికొచ్చిందని, మాజీ సీఎం కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే, ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని చెబుతున్నారని కేటీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగ నియామకాల గురించి ఒక్కరోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిరుద్యోగులను ఎప్పుడైనా మనుషులుగా చూశారా అని నిలదీశారు. 16 ఏళ్ల తర్వాత తాము అధికారంలోకి వచ్చాక, గ్రూప్-1 నిర్వహించామని, బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తొలిఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని, తల్లిదండ్రుల సాక్షిగా 70 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలిచ్చామని సీఎం వెల్లడించారు.అందెశ్రీ తనకు ఆత్మ బంధువన్న సీఎం రేవంత్ రెడ్డి, అందెశ్రీ జయంతి సందర్భంగా ఆయన స్మృతి వనానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. తెలంగాణ సమాజానికి ప్రముఖ కవిగా, గాయకుడిగా అందెశ్రీ సుపరిచితులని, అందెశ్రీ జయంతి కార్యక్రమానికి వారి కుటుంబసభ్యులను ఆహ్వానించామని అన్నా రు. శంకుస్థాపన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. అందెశ్రీ సమాధి వద్ద సీఎం, మంత్రులు నివాళులర్పించారు. “కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. నిజాంరాజును మించిన ధనవంతులుగా మీరు ఎలా మారారు. కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా?. నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. నిజాం వారసులకే ఇప్పుడు దిక్కులేదు. ఇక నీ కుటుంబం ఎంత?. గుర్తుపెట్టుకోండి మీ కుటుంబం బిచ్చమెత్తుకుని బతకాల్సి వస్తుంది. చర్చకు రమ్మంటే రారు. ఇంట్లో పడుకుంటారు. తెలంగాణను దోచుకోవాలని చూస్తే అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడు” - రేవంత్ రెడ్డి, సీఎం

### ఆహార కల్తీపై సీఎం

# రేవంత్‌రెడ్డి సమీక్ష

**సమీక్షకు హాజరైన సీఎస్ సంజయ్‌జాజు, డీజీపీ సీవీ ఆనంద్**



**హైదరాబాద్:**ఆహార, ఔషధాల కల్తీ నిరోధానికి కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదా ర్థాలు కల్తీమయం కావడంతో ప్రజలు అనా రోగ్యాల బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార, ఔషధ కల్తీ నియం త్రణపై ఎంసీహెచ్‌ఆర్డీలో రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు.ఆహార పదార్థాల కల్తీపై సీఎం సమీక్ష : ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తు ల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగు మతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. మార్కెట్?లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలతో అమ్ముతున్నారని, అయితే అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధారించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారుల సీఎం ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

### మా పాలనలో కొన్ని పొరపాట్లు జరిగాయి, ఈసారి

# నేను బాధ్యత తీసుకుంటా


**- యువ సంగ్రామ సదస్సుకు హాజరైన కేటీఆర్**



**సరూర్‌నగర్:**యువత పిడికిలి బిగిస్తే పీఠాలు కదిలిపో తాయని, బీఆంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఇప్పటిదాకా ఒక లెక్క, ఇప్పటి నుంచి మరో లెక్క అని స్పష్టం చేశారు. తమ పాలనలో కొన్ని పొరపాట్లు జరిగాయని, ఈసారి నేను బాధ్యత తీసుకుంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. తెలంగాణలో నిరుద్యోగ యువత సమస్యలు, ఉద్యోగాల భర్తీ తదితర అంశాలను ప్రధాన అజెండాగా తీసుకొని బీఆర్ఎస్ పార్టీ సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సును నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పై ప్రభుత్వంపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. యువత డిక్లరేషన్ పేరుతో బురిడీ పత్రాన్ని విడుదల చేశారని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో వేలమంది విద్యార్థులను చంపిన పార్టీ కాంగ్రెస్ అని, యూత్ డిక్లరేషన్ ఇచ్చినా ఒక్క హామీ అయినా నెరవేరిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఏమీ వచ్చిందని నిలదీశారు.జిత్తులమారి నక్క లాంటి కాంగ్రెస్ పార్టీ యువతను మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. జంగ్ సైరన్ మోగించడానికి యువతరం కదిలివచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో వేలమంది విద్యార్థులను చంపిన పార్టీ కాంగ్రెస్ అని, యువ గళాలు గర్జిస్తే కుర్చీలు కూలిపోతాయని హెచ్చరిం చారు. కాంగ్రెస్ పార్టీని ఏమీ చేయాలో యువత ఆలోచించాలని సూచించారు

### నా కుటుంబానికి

# పెద్దన్న అందెశ్రీ



**హైదరాబాద్, జులై 18:** తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ స్మృతివనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు.ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వం రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు

### భారత అంతరిక్ష రంగంలో కొత్త చరిత్ర.. 'విక్రమ్-1'

# ప్రయోగం విజయవంతం

**శ్రీహరికోట:**భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్) రూపొందించిన 'విక్రమ్-1' రాకెట్ శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లైంది. వాస్తవానికి నేడు ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన ప్రక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత రాకెట్‌ను ప్రయోగించారు.ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు.




# నేషనల్ అవార్డ్స్

**- ఉత్తమ చిత్రంగా 'కమిటి కుర్రాళ్లు'- ఉత్తమ నటుడిగా మమ్ముట్టి**




**దిల్లీ:** 72వ జాతీయ చలనచిత్ర అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈ జాతీయ చలనచిత్ర అవార్డుల విజేతలను శనివారం సాయంత్రం జ్యూరీ అనౌన్స్ చేసింది. 2024 డిసెంబర్ దాకా సెన్సార్ అయిన సినిమాలను ఈ అవార్డులో పరిగణించారు. ఇందులో తెలుగు నుంచి బెస్ట్ ఫీచర్ ఫిల్మ్?గా కొణిదెల నిహారిక నిర్మించిన 'కమిటీ కుర్రాళ్లు' సినిమాకు అవార్డు దక్కింది. అలాగే ఉత్తమ నటుడి అవార్డును మలయాళ స్టార్ హీరో మమ్ముట్టి (భ్రమయుగం), కార్తిక్ ఆర్యన్ (చందు ఛాంపియన్) ఇద్దరు సంయుక్తంగా దక్కించుకున్నారు. అలాగే ఉత్తమ నటి అవార్డును

### భారత్ మరిన్ని విజయాలతో ఉన్నత శిఖరాలను

# అధిరోహించాలి



**అమరావతి, జులై 18:** 'విక్రమ్-1' రాకెట్ తొలి ప్రయోగంలోనే విజయం సాధించడంపై సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్‌లకు ఎక్స్ వేదికగా అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1 తొలి ప్రయోగంలోనే విజయవంతంగా కక్ష్యలోకి చేరడంతో భారత్ మరో చారిత్రక మైలురాయిని అధిగమించిందన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ దేశాలతో పోటీపడే స్థాయికి భారత ప్రైవేటు అంతరిక్ష రంగం ఎదిగిందని ఈ విజయం నిరూపించిందని వెల్లడించారు. ఇది భారత అంతరిక్ష రంగంలో ఒక నూతన యుగానికి నాంది అని పేర్కొన్నారు. శాస్త్రీయ సంస్థల సామర్థ్యం, భారతీయ పారిశ్రామికవేత్తల సృజనాత్మకత కలిసినప్పుడు ఆవిష్కరణలకు కొత్త హద్దులు ఏర్పడతాయని ఈ ఘన విజయం చాటిచెప్పిందని సీఎం తెలిపారు.

# విద్యాలయాలో వికృత చేష్టలు వద్దు, ర్యాగింగ్ రహిత సమాజం దిశగా అడుగులు వేద్దాం

**- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి కె.పూజ**





**వరంగల్ జిల్లా :** భట్టుపల్లి లోని, తెలంగాణ సాంఘిక సంక్షేమ నివాస మహిళా డిగ్రీ కళాశాల, వరంగల్ కళాశాలలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో "ప్రోహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ - 1997" చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయమూర్తి కె.పూజ పాల్గొని, మాట్లాడుతూ "ర్యాగింగ్ అనేది విద్యార్థుల జీవితాలను చిన్నాభిన్నం చేసే ఒక సామాజిక భూతం అని పేర్కొన్నారు. ర్యాగింగ్ అనేది కేవలం వినోదం కోసం మొదలై, నేడు మానసిక, శారీరక హింసకు మరియు బలవన్మరణాలకు దారితీస్తోందని వాపోయారు. విద్యాసంస్థల్లో సీనియర్ విద్యార్థులు జూనియర్లను భయభ్రాంతులకు గురిచేయడం, అవమానించడం నేరంగా పేర్కొన్నారు. బాధితులు మానసిక ఒత్తిడికి లోనయి, చదువు మధ్యలోనే ఆపేయడం లేదా భయంతో ఆత్మహత్యలకు పాల్పడటం జరుగుతోంది అని వివరించారు. ర్యాగింగ్‌ను తీవ్రమైన నేరంగా పరిగణిస్తూ, ర్యాగింగ్‌కు పాల్పడినట్లు రుజువైతే విద్యాసంస్థల నుండి బహిష్కరించడమే కాకుండా, చట్టప్రకారం జైలు శిక్ష మరియు భారీ జరిమానా విధిస్తారు అని తెలిపారు. ర్యాగింగ్ కేసుల్లో చిక్కుకున్న విద్యార్థులకు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు, పాస్‌పోర్ట్ మరియు ఇతర ఉన్నత అవకాశాలు లభించవు అని హెచ్చరించారు. ప్రతీ కళాశాలలో ప్రత్యేక కమిటీలను తప్పనిసరిగా ఉండాలి అని తెలిపారు. ర్యాగింగ్ రహిత సమాజం




కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ఛీఫ్ లీగల్ ఏయిడ్ కౌన్సిల్ ఆర్.సురేష్, అసిస్టెంట్ లీగల్ ఏయిడ్ ఆర్. రజిని, కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.రాధిక, అధ్యాపకులు, సిబ్బంది మరియు సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇట్లుజిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్.

# యాదగిరిగుట్ట ఆలయంలో పరిచారక అర్చకుడిగా నియామక పత్రం అందుకున్న శ్రీ హర్ష శరవణ కుమార్



**హనుమకొండ, జూలై 18 (సుదీక్ష న్యూస్):**
ఉకల్ నాగేంద్ర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ సముద్రాల సుదర్శన్ ఆచార్యుల సుపుత్రుడు సముద్రాల శ్రీ హర్ష శరవణ కుమార్ యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో పరిచారక అర్చకుడిగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. శ్రీ హర్ష శరవణ కుమార్‌కు ఈ అవకాశం రావడం పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.
ఉకల్, చింతలపల్లి గ్రామాల ప్రజలు సముద్రాల కుటుంబాన్ని అభినందిస్తూ, శ్రీ హర్ష శరవణ కుమార్ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి సేవలో విశిష్ట సేవలందించి మరింత పేరు ప్రతిష్ఠలు సంపాదించాలని ఆకాంక్షించారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన విద్యార్థి మహ్మద్ ఇర్ఫాన్‌కు ఘన సన్మానం

**వరంగల్, జూలై 18 (సుదీక్ష న్యూస్):**
హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇంటర్నేషనల్ టైక్వాండో అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ మెగా అచీవ్‌మెంట్ కార్యక్రమంలో వరంగల్‌కు చెందిన విద్యార్థి మహ్మద్ ఇర్ఫాన్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొన్న వేలాది మంది క్రీడాకారుల్లో 1,212 మంది మాత్రమే అర్హత సాధించగా, ప్రతి క్రీడాకారుడు 40 నిమిషాల పాటు నిరంతరాయంగా కిక్స్ అండ్ పంచెస్ చేసి తమ ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో కొత్తవాడలోని




గోల్డెన్ కిడ్స్ హై స్కూల్లో 9వ తరగతి చదువుతున్న మహ్మద్ ఇర్ఫాన్ విజయం సాధించడం పట్ల పాఠశాలలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగ పాఠశాల కరస్పాండెంట్ సుజాత, ప్రిన్సిపాల్ మాధవి ఇర్ఫాన్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాధవి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యసాధనకు కృషి చేయాలని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్న ఇర్ఫాన్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిత, స్వప్న, రాణి, అజంతా, శిరీష, హేమలత, జ్యోతి, లత, పావని, అస్మ, వనిత, శివశ్రీ, చంద్రశేఖర్, సత్యనారాయణ, సుగుణాకర్, విద్యాసాగర్, స్వప్న రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

# 81 ఏళ్ల వృద్ధుడి కాలును కాపాడిన యశోదా వైద్యులు: మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ వైద్యుల ఘనత

**వరంగల్, జూలై 18 (సుదీక్ష న్యూస్):** మధుమేహం కారణంగా కాలును పూర్తిగా తొలగించాల్సిన పరిస్థితి ఎదుర్కొన్న 81 ఏళ్ల వృద్ధుడికి అత్యాధునిక వాస్క్యులర్ శస్త్రచికిత్స ద్వారా కాలును కాపాడినట్లు యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని శనివారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన 81 ఏళ్ల కుసుమ భద్రయ్యకు కుడికాలి వేళ్లలో గ్యాంగ్రీన్ ఏర్పడటంతో పాటు కాలికి రక్తప్రసరణ నిలిచిపోయే స్థితి (క్రిటికల్ లింబ్ థ్రెటెనింగ్ ఇస్కీమియా) ఏర్పడిందన్నారు. మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నిర్వహించిన పరీక్షల్లో ప్రధాన ధమనిలో తీవ్ర అడ్డంకి ఉన్నట్లు గుర్తించి, అత్యవసరంగా రైట్ ఫెమొరో--పాప్లిటియల్ బైపాస్ శస్త్రచికిత్సతో పాటు గ్యాంగ్రీన్‌కు గురైన కాలివేలిని తొలగించి మిగిలిన కాలును విజయవంతంగా కాపాడినట్లు వివరించారు. ఈ శస్త్రచికిత్సను కన్సల్టెంట్ వాస్క్యులర్ ఉ ఎండోవాస్క్యులర్ సర్జన్ డా. రంజిత్ కుమార్ ఆనందను ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు ఉన్నప్పటికీ సమన్వయ వైద్య బృందం కృషితో రోగి ఆరోగ్యం మెరుగుపడిందని పేర్కొన్నారు. మధుమేహ




రోగులు పాదాలపై చిన్న గాయాలను కూడా నిర్లక్ష్యం చేయరాదని, గాయాలు మానకపోవడం, కాళ్లలో రక్తప్రసరణ తగ్గడం, గ్యాంగ్రీన్ లక్షణాలు కనిపిస్తే వెంటనే నిపుణులను సంప్రదించాలని వైద్యులు సూచించారు. సకాలంలో వాస్క్యులర్ చికిత్స అందిస్తే అవయవాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో యశోదా ఆసుపత్రి ప్రతినిధులు మాట్లాడుతూ, అత్యాధునిక వాస్క్యులర్ శస్త్రచికిత్సలు, ఆధునిక ఇమేజింగ్ సదుపాయాలు, నిపుణుల బృందంతో తెలంగాణలో క్లిష్టమైన రక్తనాళాల వ్యాధులకు సమర్థవంతమైన చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు.

# భగత్ సింగ్ మోమెరిల్ అవార్డ్స్ అందించిన రీతూ శివపురి




**(కూకట్ పల్లి ప్రతినిధి)**
ట్విన్ సిటీస్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్ ఇండియా ఫ్రీడమ్ ఫైటర్స్ శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని లక్డికాపూల్ లోని వుడ్ బ్రిడ్జి గ్రాండ్ హోటల్ లో ఘనంగా నిర్వహించారు. ఫెమ్సిటీ హాస్పిటల్, క్రైమ్ టుడే న్యూస్, నైస్ డెవలపర్స్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ బాలీవుడ్, టాలీవుడ్ నటి మరియు మోడల్ రీతూ శివపురి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసారు. అనంతరం సమాజంలో ఉత్తమ సేవలను అందించిన జర్నలిస్టులకు, సమాజసేవలను చేస్తున్న వారికీ, బాంబ్ బ్లాస్ట్ లో గాయపడిన వారికీ షహీద్ ఈ అజాం భగత్ సింగ్ బెస్ట్ సర్వీస్ అవార్డ్స్ లను అందించారు. ఈ సందర్భంగా సూర్య ఉదయం తెలుగు దినపత్రిక తెలంగాణ ఎడిటర్ బాషా, కూకట్ పల్లి విలేకరి క్రాంతి కుమార్ లకు బెస్ట్ సర్వీస్ మెమోరియల్ అవార్డు ను ముఖ్య అతిథి, మరియు సయ్యద్ తాజుద్దీన్ , (టిసిఈయంఏ) అధ్యక్షుల చేతుల మీదుగా అందజేశారు.

# హెర్నియా సర్జ్--2026 ఘన ప్రారంభం.. దేశవ్యాప్తంగా సర్జన్ల సదస్సు

**వరంగల్, జూలై 18 (సుదీక్ష న్యూస్):** వరంగల్‌లోని వాసవి హాస్పిటల్ డైరెక్టర్, హెర్నియా సర్జ్--2026 ఆర్గనైజింగ్ చైర్మన్ డా. ఎ. సుధాకర్ సమక్షంలో దేశవ్యాప్త హెర్నియా శస్త్రచికిత్స నిపుణుల మహాసదస్సు "హెర్నియా సర్జ్--2026" శనివారం ఘనంగా ప్రారంభమైంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖ సర్జన్లు, వైద్య నిపుణులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా హెర్నియా శస్త్రచికిత్స రంగంలో మినిమల్ యాక్సెస్ సర్జరీ, లాపరోస్కోపిక్, రోబోటిక్ సర్జరీలు, అబ్డోమినల్ వాల్ రీకన్‌స్ట్రక్షన్ వంటి ఆధునిక సాంకేతికతలతో విశేష మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఈ సదస్సు ద్వారా అత్యాధునిక శస్త్రచికిత్స విధానాలు, క్లిష్టమైన కేసుల నిర్వహణ, తాజా పరిశోధనలపై నిపుణులు తమ అనుభవాలను పంచుకోనున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు కొనసాగే ఈ మహాసదస్సులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి నిపుణుల ఉపన్యాసాలు, ప్యానెల్ చర్చలు, ప్రత్యక్ష శస్త్రచికిత్స ప్రదర్శనలు, కేస్ ఆధారిత శాస్త్రీయ చర్చలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా యువ సర్జన్లకు ఆధునిక వైద్య సాంకేతికతపై అవగాహన పెంపొందించేందుకు ఈ సమావేశం ఉత్తమ వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన అసోసియేషన్ ఆఫ్ మినిమల్ యాక్సెస్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఆమాసి×) నాయకత్వానికి, దేశం నలుమూలల నుంచి విచ్చేసిన వైద్య నిపుణులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ నగర ఆతిథ్యాన్ని ఆస్వాదిస్తూ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సదస్సు నిర్వహణలో ఆర్గనైజింగ్ చైర్మన్ డా. ఎ.




సుధాకర్‌తో పాటు ఆర్గనైజింగ్ కో-చైర్మన్లు డా. బి. రాజ్ సిద్ధార్థ్, డా. శ్రీనివాస్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. సుబ్రహ్మణ్యేశ్వర బాబు, కో-సెక్రటరీలు డా. వెంకటన్న ఎం., డా. ఎన్. ప్రశాంత్ రెడ్డి, డా. రూపా బి., డా. నరేంద్ర హజారిక, ట్రెజరర్ డా. గోపి తుపాకర్ మరియు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి సదస్సు విజయవంతానికి కృషి చేశారు.

నేటి సుదీక్ష
సమకాలీన సచిత్ర దృశ్యం
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

# బహదూర్‌గూడలో హైడ్రా కంచె వేతపై రైతుల ఆగ్రహం.. 650 ఎకరాల భూసేకరణపై ఆర్డీవోతో ఘర్షణ




**రంగారెడ్డి జిల్లా** :శంషాబాద్ మండల పరిధిలోని బహదూర్‌గూడ గ్రామంలో శనివారం ఉదయం తీవ్ర ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. దేశ ప్రతిష్టాత్మక బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం గుర్తించి సేకరించిన స్థలానికి చుట్టూ రక్షణ కంచె వేసేందుకు రెవెన్యూ యంత్రాంగం, హైడ్రా అధికారులు సంయు క్తంగా క్షేత్రస్థాయికి చేరుకున్నారు. మొత్తం 650 ఎకరాల విస్తీర్ణం గల ఈ భారీ భూభాగాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, కంచె వేసే ప్రక్రియను ప్రారంభిం చడంతో బాధితులుగా మారిన స్థానిక రైతులు ఒక్కసారిగా అధికారులను అడ్డుకున్నారు. ముందస్తు న్యాయం చేయకుండా భూములను ఎలా స్వాధీనం చేసుకుంటారని నిలదీస్తూ అధికారుల తీరుకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. 30 పోలీస్ స్టేషన్ల బందోబస్తు.. రేవంత్ రెడ్డి తీరుపై విమర్శలుఈ భారీ భూసేకరణ ఆపరేషన్‌ను ఎలాగైనా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్న ప్రభుత్వం.. రైతుల నుంచి రాబోయే ప్రతిఘటనను ముందే ఊహించి ఎవరూ ఊహించని స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేసింది. బహదూర్‌గూడ గ్రామం చుట్టుపక్కల ఉన్న దాదాపు 30 వేర్వేరు పోలీస్ స్టేషన్ల నుంచి వందలాది మంది పోలీసులను, సాయుధ బలగాలను ఇక్కడ బందోబస్తు కోసం రప్పించారు. ఈ మేరకు ఉన్నతాధికారులు జారీ చేసిన ప్రత్యేక ఉత్తర్వులతో వందల సంఖ్యలో పోలీసులు గ్రామాన్ని ముట్టడించారు. ఈ పరిణామాలపై స్థానిక రైతులు, ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రభుత్వ భూదాహాన్ని తీర్చుకునేందుకే అన్యాయంగా పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటున్నారని, అన్నదాతల నోళ్లు నొక్కేందుకు ఏకంగా 30 స్టేషన్ల పోలీసులను మోహరించడం దుర్మార్గమని నిరసనకారులు మండిపడ్డారు. ఆందోళనలో స్పృహ తప్పిన రైతు నరసింహభూమిని కాపాడుకునేందుకు కంచె వేసే ప్రాంతానికి దూసుకొచ్చిన బాధితులకు, అధికారుల రక్షణగా నిలిచిన పోలీసులకు మధ్య క్షేత్రస్థాయిలో తీవ్రమైన వాగ్వాదం జరిగింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు రంగంలోకి దిగిన ఆర్డీవో శ్రీధర్‌ను స్థానికులు ఘెరావ్ చేసి నిలదీశారు. తమ హక్కులను కాలరాస్తున్నారంటూ అధికారులపైకి దూసుకెళ్లిన తరుణంలో.. పోలీసులు నిరసనకారులను బలవంతంగా వెనక్కి నెట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే రైతులు, పోలీసుల మధ్య తీవ్రమైన తోపులాట జరిగింది. ఈ ఘర్షణ వాతావరణలో నరసింహ అనే స్థానిక రైతు తీవ్ర అస్వస్థతకు గురై ఒక్కసారిగా అక్కడే స్పృహతప్పి పడిపోయాడు. పోలీసులు నిరసనకారులను బలవంతంగా దాంతో ఉద్రిక్తత మరింత తారాస్థాయికి చేరింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన నరసింహను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు పోలీసులు సిద్ధమవగా.. తోటి రైతులు వారికీ అడ్డంగా నిలిచారు. తమకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు ఇక్కడ అంగుళం భూమిని కూడా తాకనిచ్చేది లేదని, బలవంతపు కంచె వేతను తక్షణమే ఆపాలని స్థానికులు భీష్మించుకు కూర్చున్నారు.

# మంత్రి కోమటిరెడ్డి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించిన వీవోఏలు




**నీలగిరి, జూలై 18 :** ఎన్నికల సందర్భంగా వీవోఏలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని కోరుతూ ఐకేపీ వీవోఏల సంఘం ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. సమస్యలను పరిష్కారించాలని, ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని పెద్ద ఎత్తున వివాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎండీ సలీం మట్లాడుతూ.. తెలంగాణ ఐకెపి వివోఏ ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన రూ.18 వేల వేతన హామీ, ఇతర వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో అర్ధాకలితో వివోఏలు పనిచేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీవోఏలకు సంబంధం లేని బుధవారం రివ్యూ మీటింగ్స్, ఉల్లాస్ యాప్ లో పని ఆపాలని, ఆన్‌లైన్ పని ఆపాలని కోరారు. ప్రమాద బీమా రూ.10 లక్షలు, టాప్స్ నెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారం అయ్యేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. సమస్యలను పరిష్కరించకపోతే త్వరలో నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిలుముల దుర్గయ్య, పి.సులోచన మాట్లాడుతూ వీవోఏల సమస్యలన్నీ పరిష్కరించకపోతే ఈ నెల 27న కలెక్టరేట్ ముట్టడి అనంతరం సమరశీల పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు దండంపల్లి సత్తయ్య, జిల్లా సహాయ కార్యదర్శి పెంజర్ల సైదులు, జిల్లా నాయకులు పోలె సత్యనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.వెంకన్న, యూనియన్ జిల్లా నాయకులు కె.రేణుక, బి.సురేష్, కె.చంద్రకళ, రాందాస్, వై.పాపయ్య, వల్లపు రాజేశ్వరి, జిల్లపల్లి మంగ, కాసర్ల సువర్ణ, జటావత్ సరోజ, బుర్రి రేణుక, పద్మ, ఆర్ బి నాయక్, ధనలక్ష్మి, సుజాత, రాజు, సైదులు, సైదమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన'ను తక్షణమే అమలు చేయాలి



**కొత్తగూడెం గణేష్ టెంపుల్, జులై 18 :** తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోతున్న రైతులకు ఆర్థిక రక్షణ కల్పించేందుకు 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' పథకాన్ని తక్షణమే పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షుడు గొట్టేపుల్ల దుర్గా శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 23 రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న పంటల బీమా పథకం తెలంగాణ రాష్ట్రంలో సరిగ్గా అందకపోవడం వల్ల రైతాంగం తీవ్ర అనిశ్చితిని ఎదుర్కొంటోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వానాకాలం, యాసంగి పంటలన్నింటినీ దీని పరిధిలోకి తెచ్చి, కౌలు రైతులకు సైతం న్యాయం జరిగేలా పారదర్శకమైన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ని కోరడం జరిగింది. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, జాటోత్ వెంకన్న, దురిశెట్టి కుమార్, మోహనకృష్ణ, సముద్రాల గాయత్రి, రాపాక రమేష్, మిట్టపల్లి నాగుల్ చందు, వెంకటేష్ మరియు బిజెపి మహిళా నాయకురాళ్లు, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువ సంగ్రామ సదస్సు వేళ.. హైకోర్టు అనుమతి ఉన్నా.. బీఆర్‌ఎస్ నేతల హౌస్ అరెస్టులు



నిరుద్యోగ యువత పక్షాన నిలబడి, ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు బీఆర్‌ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సు శనివారం రాష్ట్ర రాజధానిలో తీవ్ర ఉద్రిక్తతలకు కారమైంది. తొలుత ఈ సభ నిర్వహణకు మల్కాజిగిరి పోలీస్ యంత్రాంగం నిరాకరించినప్పటికీ.. బీఆర్‌ఎస్ నేతలు లంచ్ మోషన్ పిటిషన్ ద్వారా హైకోర్టును ఆశ్రయించి నిబంధనలతో కూడిన ప్రత్యేక అనుమతిని సాధించారు. అయితే న్యాయస్థానం ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. పోలీసులు అప్రమత్తమై శనివారం ఉదయమే పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులను గృహ నిర్బంధం చేశారు. ముఖ్యంగా మాజీ విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రా రెడ్డిని శ్రీనగర్ కాలనీలోని ఆమె నివాసంలో, అలాగే పార్టీ కీలక నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను ఆయన నివాసంలో పోలీసులు బారికేడ్లు వేసి నిర్బంధించారు. సభకు హాజరుకాకుండా అడ్డుకునేందుకే ఇదంతా చేస్తున్నారని మండిపడ్డ నేతలు, పోలీసుల వ్యవహారశైలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుబీఆర్‌ఎస్ అగ్ర నేతల అక్రమ అరెస్టులను పార్టీ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తీవ్రంగా ఖండించారు. న్యాయస్థానాలు అనుమతి ఇచ్చిన తర్వాత కూడా విపక్ష నేతలను కట్టడి చేయడం ముమ్మాటికీ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీయడమేనని విమర్శించారు. "ప్రజాస్వామ్య ంలో శాంతియుత నిరసనలు, సభలు నిర్వహించుకోవడం ప్రతి రాజకీయ పార్టీకి ఉన్న ప్రాథమిక హక్కు. కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిన ప్రభుత్వమే, ఇలా చట్ట విరుద్ధంగా వ్యవహరించడం దురదృష్టకరం" అని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న ఈ నిర్బంధాలపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని, అక్రమంగా నిర్బంధించిన నేతలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన సీదిరి అప్పలరాజు తనయుడు.. గౌతు శిరీష రియాక్షన్హామీలు నెరవేర్చాలంటూ నినాదాలు పోలీసుల ఆంక్షలు, గృహనిర్బంధాల నడుమ కూడా బీఆర్‌ఎస్ శ్రేణులు వెనక్కి తగ్గలేదు. ప్రభుత్వం ఎన్ని అడ్డం కులు సృష్టించినా, నిర్బంధాలకు పాల్పడినా నిరుద్యోగ యువత, విద్యార్థుల గళాన్ని తాము గట్టిగా వినిపిస్తూనే ఉంటామని నేతలు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఇటువం టి నియంతృత్వ పోకడలను మానుకోవాలని, ఎన్నికల వేళ తాము ప్రామిస్ చేసిన విధంగా రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రి యను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే నోటిఫికేషన్లు జారీ అయి, పూర్తయిన ఉద్యోగాలకు ప్రస్తుతం తామే నియామక కాంగ్రెస్ అబద్ధపు ప్రచా రాలు చేసుకుంటోందని గులాబీ నేతలు మండిపడ్డారు.

# అక్రమ సొమ్మంతా బినామీ పేర్ల మీదే! వారి లెక్కలూ తేల్చనున్న ఆదాయ పన్ను శాఖ!




**హైదరాబాద్:** అవినీతి అధికారుల రూ.వందల కోట్ల విలువైన అక్రమాస్తుల చిట్టాలు ఇటీవల ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. ఏ అధికారి వద్ద చూసినా కళ్లు చెదిరేలా నగలు, నగదు, లెక్కలేనన్ని ఫ్లాట్లు, ఎకరాల కొద్దీ వ్యవసాయ భూములు, పక్క రాష్ట్రాల్లో ఆస్తులు వెలుగు చూస్తున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొందరు అక్రమార్కులు పోగేస్తున్న సంపద లెక్కకు మిక్కిలిగా ఉంటోంది. ఇలాంటి వారి అంతు చూడటానికి ఆదాయపు పన్ను శాఖ రంగంలోకి దిగింది. ప్రస్తుతం అవినీతిపరుల గుండెల్లో దడ పుట్టిస్తున్న అవినీతి నిరోధక శాఖతో కలిసి అస్త్రాలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా అక్రమ సొమ్మును బినామీల పేర్ల మీద పెడుతున్న అవినీతి అధికారుల అక్రమార్జనను గుర్తించి, జప్తు చేసేందుకు బినామీ లావాదేవీల నిరోధక విభాగం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. బినామీ ఆస్తుల లావాదేవీల నిరోధక చట్టం-1988తో బినామీల గుట్టు రట్టు చేయనుంది. దీనికి సంబంధించి అవినీతి నిరోధక శాఖ అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆస్తులన్నీ బినామీల పేర్ల మీదే : ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏ అధికారి ఇంట్లో సోదాలు చేసినా, మార్కెట్ ధరల ప్రకారం రూ.వందల కోట్ల ఆస్తులు వెలుగు చూస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల దొరికిన డీఎస్పీ భీంరెడ్డి ఆస్తుల విలువ మార్కెట్? ధరల ప్రకారం కనీసం రూ.200 కోట్లు ఉంటుందని అంచనా. కర్ణాటకలో ఒక దగ్గర 38, మరో దగ్గర 6 ఎకరాల భూమి కొనుగోలు చేసిన హోంగార్డు అతని బినామీ అని గుర్తించారు. ఇలాంటి బినామీలు 10 మంది వరకు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈయనొక్కడే కాదు, పట్టుబడుతున్న వారిలో అత్యధికులు తమ ఆస్తులను బినామీల పేర్ల మీద బదలాయిస్తున్నారు. వారు విధుల్లో ఉన్నప్పుడు తమ పేర్ల మీద ఆస్తులు కొనుగోలు చేయాలంటే అధికారిక అనుమతులు తీసుకోవాలి. అలా చేస్తే వారి బండారం బయట పడుతుండటంతో బినామీలను పెట్టుకుంటు న్నారు. అవినీతి నిరోధక చట్టం ప్రకారం కేసు దర్యాప్తు చేసే అధికారులు బినామీల జోలికి వెళ్లరు. వారి వాంగ్మూలం నమోదు చేసి, న్యాయస్థానానికి తెలియజేస్తారు. దీంతో అక్రమార్కులకు తేలికగా తప్పించుకునే అవకాశం ఉంది. ఏడాదికి 60-70 కేసులు : బినామీ ఆస్తుల లావాదేవీల నిరోధక చట్టం ఇలాంటి బినామీలను గుర్తించి, వారి పేర్ల మీద ఉన్న ఆస్తులను కూడా జప్తు చేసే అధికారం ఆదాయపు పన్ను శాఖకు కట్టబెట్టింది. దీనికో సం ప్రత్యేకంగా బినామీ లావాదేవీల నిరోధక విభాగం ఏర్పాటు చేశారు. హైదరాబాద్ విభాగంలో ఏడాదికి 60 నుంచి 70 కేసులు నమోదవుతున్నాయి. కేసు వివరాలు తెప్పిం చుకుంటున్న అవినీతి నిరోధకశాఖ : ఉదాహరణకు కరడుగట్టిన నేరగాడు నయీం బెదిరించి రాయించుకున్న ఆస్తులను తన కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల పేర్ల మీద పెట్టాడు. నయీం నేరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టినప్పుడు బినామీల గుట్టు రట్టు చేసే పని ఆదాయ పన్ను శాఖ తీసుకుంది. బినామీలుగా గుర్తించిన వారికి నోటీసులు పంపి ఆస్తులు జప్తు చేసింది. ఇప్పుడు అవినీతి నిరోధక శాఖ నమోదు చేస్తున్న ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో నిందితులపై కూడా బినామీ ఆస్తుల నిరోధక చట్టాన్ని ప్రయోగించేందుకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసు వివరాలు తెప్పించుకుంటోంది.

# కేటీఆర్, పువ్వాడ అజయ్ చొరవతో గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ స్థాపన




**ఖమ్మం జిల్లా:** గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ స్థాపనకు మాజీ మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్ కుమార్ ఆనాడే చొరవ తీసుకున్నారు. బీఆర్ఎస్ హయాంలోనే రూ.300 కోట్ల పెట్టుబడితో గోద్రేజ్ గ్రూప్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో శ్రీకారం చుట్టి మాజీ మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్ కుమార్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఆయిల్ పామ్ సాగును విస్తరించి, రైతులకు అధిక ఆదాయం కల్పించడం, దేశంలో వంటనూనెల దిగుమతులను తగ్గించడం లక్ష్యంగా అనేక చర్యలు చేపట్టింది. రైతులు పండించిన పంటలను సమయానికి కొనుగోలు చేసి ప్రాసెస్ చేయడానికి ప్రైవేట్ సంస్థలను ఆహ్వానించింది ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం. అందులో భాగంగా వివిధ జిల్లాల్లో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసింది. అప్పటి కృషి ఫలితంగా ఖమ్మం జిల్లాలో గోద్రేజ్ అగ్రోవెట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ఏర్పాటు అయింది. గోద్రేజ్ అగ్రోవెట్‌తో పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టి రైతులకు మార్కెట్, ఉపాధి అవకాశాలు పెంచాలని లక్ష్యంగా ఈ ప్రాజెక్టుకు అప్పటి మంత్రి కేటీఆర్, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తదితరులు శంకుస్థాపన చేశారు. మిషన్ మోడ్‌లో విస్తరించే లక్ష్యంతో ప్రణాళికలు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును మిషన్ మోడ్‌లో విస్తరించే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించింది. రైతులకు పరిశ్రమలతో అనుసంధానం కల్పించే విధానాన్ని అనుసరించింది ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచేందుకు పెట్టుబడులను ప్రోత్సహించింది. తెలంగాణను ఆయిల్ పామ్ ఉత్పత్తిలో అగ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దడం రైతుల ఆదాయాన్ని పెంచడం వంటనూనెల పామ్ ఉత్పత్తి పెరగడం ద్వారా దిగుమతులపై ఆధారపడటం తగ్గించి ఆహార నూనెల స్వయం సమృద్ధి లక్ష్యానికి ఈ తరహా ప్రాజెక్టుల స్థాపనకు ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తోడ్పాటు అందించింది.

# కలలో రక్తం చిందినట్లు పీడకలలు.. చెరువులో దూకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య



**మేడ్చల్, జులై 18:** జిల్లా పరిధిలోని పీర్జాదిగూడలో ఓ యువతి, గుడిలోని అమ్మవారి విగ్రహం తీసుకెళ్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. యువతి మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు, హైడ్రా బృందాలు.. విగ్రహం కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా దేవుపల్లి గ్రామానికి చెందిన అరుణ (52), ఆమె కూతురు తేజస్విని (25) గత కొంతకాలంగా శంకర్ నగర్‌లోని ఓ ఇంట్లో నివాసముంటున్నారు. తేజస్విని గత ఆరు నెలల క్రితం వరకు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసి.. రాజీనామా చేసింది. ప్రస్తుతం తన తల్లితో కలిసి ఉంటోంది. అయితే, నిన్న(శుక్రవారం) అర్ధరాత్రి వేళ తేజస్విని నగ్నంగా స్థానిక ఆలయానికి వెళ్లి, అక్కడ ఉన్న అమ్మవారి విగ్రహాన్ని, చీరను తీసుకుని పక్కనే ఉన్న పీర్జాదిగూడ చెరువులోకి దూకేసింది. ఉదయం తేజస్విని మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, హైడ్రా (, డిఆర్‌ఎఫ్ సిబ్బంది.. చెరువులో యువతి మృతదేహాన్ని వెలికి తీశారు. చెరువు సమీపంలోని సీసీకెమెరా ఫుటేజీలను పరిశీలించగా.. విగ్రహాన్ని తీసుకుని నగ్నంగా చెరువులో దూకినట్లు కనిపించింది. ఇప్పటికే తేజస్విని మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు.. అమ్మవారి విగ్రహం కోసం గాలిస్తున్నారు.

# బండి సంజయ్, ఈటల మధ్య కుదిరిన సయోధ్య



**హైదరాబాద్, జులై 18:** తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు. వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నేటి సుదీక్ష
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం, జూలై 19, 2026


# రామ్‌చరణ్-సుకుమార్ కాంబో

## ఆర్‌సీ 17 పట్టాలకెక్కనుందని ప్రచారం



ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్‌తో సినిమాకు సిద్ధం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్–రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు.

# ప్రియాంక చోప్రా బర్త్‌డే

## విషెస్ చెబుతూ వారణాసి లుక్ విడుదల



మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి'లో మహేశ్‌కు జోడీగా బాలీవుడ్ నటి ప్రియాంక కనిపించనున్న విషయం తెలిసిందే. మందాకిని పాత్రలో ఆమె సందడి చేయనున్నారు. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా సినిమా సెట్‌లోని ఫొటోలను విడుదల చేస్తూ రాజమౌళి పోస్ట్ పెట్టారు. 'ఆమె నవ్వితే అందం.. నవ్వకపోతే నిప్పు కణిక' అనే క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్ కూడా ప్రియాంకకు విషెస్ చెప్పారు. 'మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్‌డే..' అని పోస్ట్ పెట్టారు. ప్రియాంక 'వారణాసి' కోసం 14 నెలల నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇందులో అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతో పాటు కాలాల్ని చుట్టేసే సాహసికుడి కథగా ఇది ముస్తాబవుతున్నట్లు తెలిసిందే. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ప్రియాంక చోప్రా ఫొటోస్ రిలీజ్ నేపథ్యంలో సోషల్ మీడియాలో మరోసారి ఆసక్తికర ప్రచారం మొదలైంది. మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 9న వారణాసి తొలి గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు అభిమానులు, ఫ్యాన్ పేజీలు పెద్ద ఎత్తున పోస్టులు చేస్తూ హల్‌చల్ చేస్తున్నాయి. 'బాబు బర్త్‌డేకు భారీ సర్‌ప్రైజ్', 'బాబు బర్త్‌డేకు గ్లింప్స్ లోడింగ్'. 'ఆగస్టు 9న ఇంతకుముందెన్నడూ చూడని హైప్ చూడబోతున్నారు' అంటూ అభిమానులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు షేర్ చేస్తున్నారు. దీంతో హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్‌లో ఉన్నాయి.

# ఇన్‌స్టాలో దుమ్మురేపిన ఫౌజీ

### ఫస్ట్‌లుక్ విడుదల కాగానే 5.33 లక్షల లైక్స్



రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది. దీంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికంగా షేర్ చేయబడిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌గా ఇది కొత్త రికార్డును సృష్టించింది. అభిమానులు ఈ పోస్టర్‌ను భారీ స్థాయిలో షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక డిజిటల్ వేడుకలా మార్చేశారు. ఈ రికార్డు ప్రభాస్ డిజిటల్ క్రేజ్‌కు మరో నిదర్శనంగా మారింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈసారి ప్రభాస్ మరో హీరో రికార్డును కాదు, తన సొంత రికార్డునే బద్దలు కొట్టారు. గతంలో 'స్పిరిట్' ఫస్ట్ లుక్ పోస్టర్ 5.19 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు 'ఫౌజీ' దానిని అధిగమించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఆధిపత్యం మరింత బలపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పోస్టర్ అభిమానులను అంతగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం అందులో కనిపించిన ప్రభాస్ లుక్. ఒక వార్ ఫ్రంట్ లో గాయాలతో కూర్చుని ఉన్న ఆ రూపం చాలా క్రేజీగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ లుక్‌తో వచ్చిన ఈ రికార్డు సినిమా చుట్టూ ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రభాస్ అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడ్ వార్ డ్రామాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రభాస్ పవర్‌ఫుల్ రోల్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో ఇప్పటికే 'ఫౌజీ' సృష్టిస్తున్న సంచలనం చూస్తుంటే, ఈ సినిమా కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా

# మరోమారు వార్తల్లో నటి నమిత

## స్లిమ్‌గా మారిన ఫోటోలతో నెటిజన్ల ఆసక్తి



ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన నమిత ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటూ కుటుంబ జీవితంలో బిజీగా గడుపుతున్న ఆమె.. తాజాగా తన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు.ఒకప్పుడు బొద్దుగా కనిపించిన నమిత.. ఇప్పుడు పూర్తిగా స్లిమ్‌గా మారి అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. జిమ్‌లో కఠినంగా వర్కౌట్స్ చేస్తున్న వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. మీ మనసు ఏదైతే నమ్ముతుందో.. మీ శరీరం దానినే అనుసరిస్తుంది అనే సందేశాన్ని కూడా ఆ వీడియోకు జత చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు వరుసగా కామెంట్లు చేస్తున్నారు. ఇంత స్లిమ్‌గా మారారు ఏంటి?, నిజంగా ఇది నమితేనా?, స్టైలిష్ లుక్ అదిరిపోయింది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలా మంది ఆమె కొత్త లుక్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నమిత సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. కన్నడ, తమిళ, తెలుగు, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'సొంతం' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఆమె.. 'ఒక రాజు ఒక రాణి', 'ఓ రాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి', 'బిల్లా', 'నాయకుడు', 'సింహా', 'మన్యం పులి' వంటి చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా బాలకృష్ణ నటించిన 'సింహా' సినిమాలో ఆమె గ్లామర్, నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెళ్లి అనంతరం సినిమాలకు విరామం ఇచ్చిన నమిత గత కొన్నేళ్లుగా పూర్తిగా కుటుంబ జీవితానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే తాజాగా ఆమె ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి సరికొత్త లుక్‌లో కనిపించడంతో.. త్వరలోనే మళ్లీ వెండితెరపై రీఎంట్రీ ఇవ్వబోతున్నారా? అనే చర్చ సినీ వర్గాల్లో మొదలైంది. అయితే దీనిపై నమిత నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# బేబీ బంప్‌తో రెబా మోనికా



తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సామజవరగమన' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మలయాళ ముద్దుగుమ్మ రెబా మోనికా జాన్. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన నవ్వుతో సౌత్ ఇండియాలో ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించుకున్న ఈ నటి, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. థాయిలాండ్‌లోని పుకెట్ బీచ్ రిసార్ట్‌లో రెడ్ కలర్ ప్రింటెడ్ మ్యాక్సీ డ్రెస్ ధరించి, తన బేబీ బంప్‌ను చూపిస్తూ ఆమె దిగిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి.ఆ హీరోయిన్ స్ట్రాంగ్ మెసేజ్ పెళ్లి తర్వాత కూడా కెరీర్‌లో దూకుడు: మోడలింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న రెబా మోనికా జాన్ ట్రెడిషనల్ శారీస్ అయినా, మోడ్రన్ వెస్ట్రన్ వేర్ అయినా చాలా స్టైలిష్‌గా క్యారీ చేస్తుంది. ఈమె 2022 జనవరిలో తన చిరకాల మిత్రుడు జోమోన్ జోసెఫ్‌ను వివాహం చేసుకున్నారు. ఇక ఇక పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో ఎంతో యాక్టివ్‌గా ఉంటున్న ఈ బ్యూటీ, తెలుగులో సామజవరగమన తో పాటు మృత్యుంజయ్, మ్యాడ్ స్క్వేర్ వంటి క్రేజీ చిత్రాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది.ప్రస్తుతం ప్రెగ్నెంట్‌గా ఉన్న రెబా, ద నాకా పుకెట్ రిసార్ట్‌లో వెకేషన్‌ను ఫుల్‌గా ఎంజాయ్ చేస్తోంది. అక్కడ బీచ్ ఒడ్డున వైబ్రెంట్ రెడ్ ప్రింటెడ్ స్ట్రాపీ మ్యాక్సీ బీచ్ డ్రెస్ ధరించి సరికొత్తగా ఫోటోలకు పోజులిచ్చింది. హై లెగ్ స్లిట్ ఉన్న ఈ డ్రెస్‌లో ఆమె తన మెటర్నిటీ లుక్‌ను ఎంతో కాన్ఫిడెంట్‌గా ప్రదర్శించింది. ఇక ఇక ఆమె ముఖంలో కనిపిస్తున్న ప్రెగ్నెన్సీ గ్లో చూసి అభిమానులు మురిసిపోతున్నారు. "ప్రెగ్నెన్సీ గ్లో అనేది నిజంగానే అద్భుతం" అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

# నాని ప్యారడైజ్‌కు భారీ డిమాండ్



నాచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో భారీ రికార్డ్స్ సృష్టిస్తుంది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టడంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ చిత్రం థియేట్రికల్ బిజినెస్‌లో కొత్త రికార్డులు సృష్టిస్తుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం.. 'ది ప్యారడైజ్' నైజాం థియేట్రికల్ హక్కులను మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ రూ.37 కోట్లకు సొంతం చేసుకుంది. నాని కెరీర్‌లో ఇప్పటివరకు ఏ చిత్రానికీ ఈ స్థాయిలో నైజాం బిజినెస్ జరగకపోవడంతో ఇది రికార్డు డీల్‌గా నిలిచింది. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఓటిటిలోకి బాలన్..ది బాయ్



'మంజుమ్మల్ బాయ్స్' చిత్రంతో మలయాళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు చిదంబరం. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'బాలన్ - ది బాయ్'. చందు సలీమ్ కుమార్, టొవినో థామస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జులై 31 నుంచి జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో అందుబాటులోకి రానుంది. హత్య కేసులో జైలుకు వెళ్లిన మహిళ అక్కడ ఓ అబ్బాయికి జన్మనిస్తుంది. శిక్ష పూర్తయి బయటకు వచ్చాక తన గతం గురించి ఎవరికీ చెప్పకుండా మారుపేర్లతో అన్ని ప్రాంతాలు తిరుగుతూ ఉంటుంది. కల్లోలభరితమైన బాల్యం, ఆ తర్వాత అదృశ్యమైన తన తల్లి కోసం వెతుకుతున్న ఒక టీనేజ్ అబ్బాయి కథగా 'బాలన్ - ది బాయ్' రూపొందింది. మే నెలలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సినీ ప్రముఖులు సూర్య, నాగచైతన్య తదితరులు ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు.